కథ

''ఏవండీ! మీకసలే లౌక్యం తెలియదు. బజార్లో సరుకులు కొనేటప్పుడు కాస్త జాగ్రత్తగా బేరమాడి కొనాలి! ముఖ్యంగా చీరలు కొనేటప్పుడు మరీ జాగ్రత్తగా ఉండాలి సుమా!'' అంది తాయారు భర్త లోకనాథంతో.

# లౌక్యం

''సర్లేవే! మరీ చిన్న పిల్లాడికి చెప్పినట్టు చెబుతావు'' అన్నాడు విసుగ్గా.

''అది కాదండీ! బట్టల షాపులో చెప్పిన రేటులో సగానికంటే తక్కువగా అడగాలి! తరువాత వాడు కొంచెం కొంచెం దిగివస్తాడు. మనం నెమ్మది నెమ్మదిగా పెంచాలి. సగం కంటే తక్కువగా బేరమాడి కొనగలిగితే మనం తెలివిగా బేరం చేసినట్టే! సగం ధరకు కొన్నామంటే ఫరవాలేదన్న మాట!'' బేరసారాల్లోని కిటుకుల్ని వివరించింది తాయారు.

లోకనాథం పెళ్ళాం చెప్పినవన్నీ చచ్చినట్టు విని బజారుకి బయలుదేరాడు.

ఆరోజు శనివారం శెలవు కావడంతో తాయారు లోకనాథంతో బజారుకెళ్ళి వచ్చే వరలక్ష్మీ వ్రతానికి తనకు కావలసిన రకరకాల సరంజామా కొనుక్కు రమ్మని చెప్పింది. అందులో ఓ చీరా జాకెట్టూ కూడా ఉన్నాయి.

కిరాణాషాపులో కావలసిన సరుకులు కొనుక్కుని బట్టల దుకాణంలో అడుగు పెట్టాడు లోకనాథం. చీరలు చూపించమని అడిగాడు సేల్స్‌మాన్‌ని. అడిగిందే తడవుగా డజన్లకొద్దీ చీరలు మడతలు విప్పి లోకనాథం ముందు కుప్పలుగా పోసేస్తున్నాడు సేల్స్‌మాన్.

''చాల్లేవయ్యా బాబూ! ఏది సెలక్ట్ చేసుకోవాలో తెలిసి చావడం లేదు'' అన్నాడు లోకనాథం.

కాసేపు చీరలన్నీ పరిశీలించి ఓ బ్లూకలర్ శారీ సెలక్ట్ చేసి

''రేటెంత!'' అని అడిగాడు లోకనాథం.

''ఎనిమిదొందలు'' చెప్పాడు సేల్స్‌మాన్.

లోకనాథం కాసేపు ఏమని అడగాలో ఆలోచించుకోవడం మొదలుపెట్టాడు.

''బట్టల షాపులో చెప్పిన రేటుకన్నా సగం తక్కువకి అడగాలి!'' భార్య మాటలు ఆకాశవాణిలా చెవుల్లో వినిపించాయి.

పెళ్ళాం ముందు చెప్పినదానికల్లా తలూపాడే గాని అలా బేరమాడాలంటే ఎందుకో భయంగా ఉంది.

సేల్స్‌మాన్ తననో మ్యానర్స్ లేని వాణ్ణి చూసినట్టు చూడడు కదా! అనుకున్నాడు.

ధైర్యం కోసం ఒక్కసారి ఆంజనేయస్వామిని తలుచుకొన్నాడు.

''మరీ ఎనిమిదొందలు అంటే ఎలాగండీ! కొంచెం తగ్గించి చెప్పండి!'' అన్నాడు లోకనాథం.

సేల్స్‌మాన్ కాసేపునసిగి

''ఊ! ఓ పాతిక రూపాయలు తగ్గించుకొని తీసుకోండి'' అన్నాడు.

లోకనాథానికి పెద్ద డిజప్పాయింట్‌మెంటే ఎదురైంది. ఈ రేటుకి పట్టుకెళితే భార్య ముందు డిపాజిట్లు కోల్పోయిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి ముందు నిలబడినట్టు నిలబడాలి. ఏం చెయ్యాలో తెలియక బెల్లం కొట్టిన రాయిలా అలాగే ఉండిపోయాడు.

''అదేంటండీ అలాగే ఉండిపోయారు? ఏదో ఓ మాట చెప్పండి!'' అన్నాడు సేల్స్‌మాన్.

లోకనాథం ధైర్యం కోసం ఈసారి పెళ్ళాన్ని తలుచుకున్నాడు.

''మూడు వందల యాభైకిస్తావా?'' బెదురు బెదురుగా అడిగాడు లోకనాథం.

సేల్స్‌మాన్ ఓసారి లోకనాథం వంక చీడపురుగుని చూసినట్టు చూసి-

''ఎంతకీ?'' అన్నాడు వెటకారంగా.

''మూడు వందల యాభైకి'' నసుగుతూ చెప్పాడు లోకనాథం.

''ఎప్పుడైనా పెళ్ళానికి చీరకొన్న మొహమేనా ఇది! జీవితంలో ఇంతవరకూ నువ్వయినా కొనుక్కున్నావేంటయ్యా బట్టలు'' ఒకేసారి తుపాను ముంచుకొచ్చినట్టు విరుచుకుపడ్డాడు సేల్స్‌మాన్.

''ఏంటయ్యా అంత కోపమెందుకూ! నీకు కిడితే యియ్యి లేకపోతే మానెయ్'' అన్నాడు లోకనాథం సర్దుకుంటూ.

''వెళ్ళు వెళ్ళవయ్యా! పెద్ద కొనొచ్చావు! నీకన్నా ఆడవాళ్ళు నయమయ్యా! ఫో ఫో!'' అన్నాడు విసురుగా.

లోకనాథానికి ఆ దెబ్బతో తల తిరిగినట్టనిపించింది. ఓసారి చుట్టూ చూసుకున్నాడు. ''హమ్మయ్య! మన ఆఫీసులో వాళ్ళు ఎవరూ చూళ్ళేదు బతికిపోయాం!'' అనుకున్నాడు.

ఇంటికెళ్ళాక తాయారుకి జరిగిందంతా చెప్పాడు. బేరం సరిగా చేయలేకపోయినందుకు తాయారు కూడా లోకనాథాన్నే తిట్టిపోసింది.

★★★

''బెడ్ షీట్లోయ్! రంగు రంగుల బెడ్ షీట్లోయ్!'' రోడ్డు మీంచి వినిపిస్తున్న ఆ కేక విని బాత్రూంలో స్నానం చేస్తున్న తాయారు లోకనాథాన్ని పిలిచింది.

''ఏవండీ! ఆ బెడ్ షీట్లతన్ని పిలిచి కొంచెం బేరమాడండి. కుదిరితే నాలుగు బెడ్ షీట్లు తీసుకుందాం!'' అంది.

''అబ్బ! ఆ గొడవ నాకు తెలియదు! నువ్వు స్నానం చేసి వచ్చిన తర్వాత బేరమాడుకో!''

''నేనొచ్చేటప్పటికి వాడు వెళ్ళిపోతాడండీ! ఈలోపు మీరు మాట్లాడుతూండండి. నేనొచ్చిన తరువాత మాట్లాడతాను!'' భార్య బలవంతం పెట్టడంతో హాల్లో కూర్చుని పేపర్ చదువుకుంటున్న లోకనాథానికి కదలక తప్పింది కాదు.

గేటు బయటకు వెళ్ళి ఆ బెడ్ షీట్లతన్ని పిలిచాడు. వాడు వచ్చి మూట దింపి రకరకాల దుప్పట్లు చూపించడం మొదలుపెట్టాడు. ఒక జత తీసి ఖరీదెంతని అడిగాడు లోకనాథం.

''ఏవండీ! ఇంట్లో అమ్మగారు లేరా!'' అన్నాడు బట్టలవాడు. ఎందుకడిగాడో అర్థం కాలేదు లోకనాథానికి.

''ఆ ఉన్నారులే! వస్తారు నువ్వు ముందు రేటెంతో చెప్పవోయ్!'' అన్నాడు లోకనాథం.

''రెండు బెడ్‌షీట్లూ నాలుగొందల యాభై అండీ!'' అన్నాడు.

ఒక్కసారిగా లోకనాథానికి గుండాగినంత పనైంది.

''నాలుగొందల యాభైయే! ఏంటయ్యా మరీ ఇంత రేటు చెబుతున్నావు?'' అన్నాడు.

''అయ్యా! తమరు బేరమాడండి! ఎంతకు కావాలో చెబితే దాన్ని బట్టి నేను రేటు చెబుతాను!'' అన్నాడు.

ఆ రెండు బెడ్‌షీట్లూ నాలుగొందల యాభైకి కొనడం ఏమాత్రం ఇష్టంలేదు లోకనాథానికి. వద్దని పంపించి వేద్దామంటే ఓ ప్రక్క ఈ మూటవాడు జిడ్డులా పట్టుకుంటున్నాడు. మరోపక్క తాయారు వచ్చి బుర్ర తింటుంది. లోకనాథం రిస్కు తీసుకోదలుచుకోలేదు. ఇంట్లోకి వెళ్ళాడు తాయారు సలహాకోసం. స్నానం ముగించుకొని చీర కట్టుకుంటోంది తాయారు.

''నాలుగొందల యాభై చెబితే నూటయాభైకి అడగండి!'' అంది ఈజీగా.

లోకనాథానికి మతిపోయింది. నోరు పెగలడం లేదు.

''నాలుగొందల యాభై చెబితే నూట యాభైకి అడగటమేమిటి దరిద్రంగానూ'' అన్నాడు మొన్న షాపులో జరిగిన అవమానం గుర్తుకు రాగా.

''అంతేనండీ! నాలుగొందలకి గానీ అడుగుతారా ఏమిటి? మీ అసాధ్యం కూలా! భలేవారే!'' అంది. ఈమాత్రం లోకజ్ఞానం లేదా మీకు అన్నధోరణిలో.

లోకనాథం ఆ క్షణంలో నిజంగానే తనకి లోకజ్ఞానం లేదనుకున్నాడు.

''నావల్ల కాదు గానీ ఆ అడిగేదేదో నువ్వే అడుగు! ఆగాగు అది కూడా ఏ మూడొందల యాభైకో అడుగు. అంతేగాని నూటయాభైకీ, వందకీ అడిగితే వాడు తిట్టుకుంటాడు!'' అన్నాడు.

''ఎందుకు తిట్టుకుంటాడు. ఇవ్వడం ఇష్టంలేక

పోతే పోతాడు. మనమేమైనా వాణ్ణి బ్రతిమాలి పిలిచామా!'' అంది కొంచెం కోపంగా.

''సర్లే! నీ యిష్టమొచ్చినట్టు బేరమాడు! నాకెందుగ్గాని'' అన్నాడు లోకనాథం మళ్ళీ పేపరు చదువుకొంటూ.

తాయారు బయటికొచ్చి గుమ్మంలో ఉన్న దుప్పట్లవాడితో

''ఏమయ్యా జత బెడ్‌షీట్లు నూట యాభైకిస్తావా?'' అంది.

''కిట్టదండీ!''

''ఎందుకు కిట్టదూ! మొన్న నేను ఇలాంటివే షాపులో తీసుకున్నాను. మా పిన్నిగారికని..వందకే యిచ్చారు. ఏదో నువ్వు అంతదూరం నుంచి మోసుకు తిరుగుతున్నావు కదా! అదీగాక ఇంటికి తెచ్చావు కదా! అని ఓ యాభై ఎగస్ట్రా పెట్టాను! ఇస్తే యివ్వు లేకపోతే లేదు!'' అంది.

''అది కాదండీ! ఇంకోమాట చెప్పండి!'' అన్నాడు బట్టలవాడు.

''నేను చెప్పేదంతే నువ్వు చెప్పాల్సిందేమన్నా ఉంటే చెప్పు'' అంది తాయారు.

తాయారు, బట్టలవాడు దాదాపు ఓ అరగంటసేపు బేరసారాలు జరిపారు. ఆఖరికి బట్టలవాడు నూట డెభ్భై అయిదుకి యిస్తానన్నాడు.

పక్కనే ఉండి ఇదంతా చూస్తున్న లోకనాథానికి మతిపోయింది. నాలుగొందల యాభై ఎక్కడ, నూట డెభ్భై ఐదెక్కడ. రెంటికీ ఏమైనా పొంతన ఉందా అని జుట్టు పీక్కున్నాడు.

''అదికాదు అమ్మాయిగారూ! నేను చెప్పిందానికీ చాలా తగ్గి నూట డెభ్భై అయిదుకి దిగాను! మీరేమో నూట యాభైకి అడిగి ఒక్క రూపాయి కూడా పెంచలేదు. మీరు అలాగ మొండి పట్టు పట్టుకు కూర్చుంటే ఎలాగండీ! యవ్వారమన్నాక కాస్త పట్టు విడుపుండాల ఎంతోకొంత పెంచండి మరి! లేకపోతే నాకు గిట్టదూ!'' అన్నాడు నొచ్చుకుంటూ బట్టలవాడు.

''సర్లే ఇంకో అయిదు రూపాయిలు పెంచుతున్నానులే! నూట యాభై అయిదు చేసి యివ్వు! ఏవిటో నిన్ను చూస్తే నాకు యిబ్బంది పెట్టబుద్ధికావడం లేదు!'' అంది తాయారు తెగ జాలిపడిపోతూ.

లోకనాథానికి మళ్ళీ మతిపోయింది.

బట్టలవాడు కాసేపు వెనకాముందులాడి ఓ నిట్టూర్పు విడిచి

''సర్లే! ఆ నూట యాభై అయిదుకే రెండు బెడ్ షీట్లూ తీసుకోండి!'' అన్నాడు.

లోకనాథానికి తల తిరిగిపోతోంది.

తాయారు బట్టలవాణ్ణి పంపించివేసి లోకనాథానికి చిన్నసైజు క్లాసు పీకింది. ఇప్పటికైనా బేరమాడ్డం నేర్చుకోమని సారాంశం.




★★★

లోకనాథం పక్కింట్లో ఒక బ్యాచిలర్ దిగాడు.

అతను బట్టలషాపులో సేల్స్‌మాన్‌గా పనిచేస్తున్నాడు.

కొంతకాలం తర్వాత అతనితో లోకనాథానికి పరిచయం పెరిగింది.

''ఏమయ్యా సురేష్! మీ బట్టల షాపుల వాళ్ళంతా బేరసారాలు జరిపేటప్పుడు ఆడవాళ్ళకిచ్చినంత అవకాశం మగవాళ్ళకివ్వరెందుకనీ? పైపెచ్చు ఆడోళ్ళలా బేరమాడితే మగవాళ్ళను తిడతారు కూడా?'' అన్నాడు లోకనాథం.

''అబ్బే! అదేం లేదండీ! సాధారణంగా ఆడవాళ్ళ మనస్తత్వాన్ని బట్టి కొంచెం రేటు ఎక్కువగానే చెబుతాము. వాళ్ళు బేరమాడి తగ్గించుకుంటారు. వాళ్ళకదో తృప్తి. కరెక్ట్ రేటు చెప్పేసి బేరమాడ్డానికి ఛాన్స్ యివ్వకపోతే లేడీస్ కొనరు. అదే మగవాళ్ళ విషయంలో అలా రేటు పెంచి చెప్పలేము. అందుకే మగవాళ్ళు మరీ తగ్గించి బేరమాడితే మాకు కోపం వస్తుంది'' అసలు కిటుకు వివరించాడు సురేష్. ★

**అడబాల అప్పారావు**